ప్రజాశక్తి
మంగళవారం 15 ఏప్రిల్ 2025
5
అనంతపురం





జెడ్పీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నిబంధనలు నిల్.. నొక్కుడు ఫుల్..!

◆ పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కరువు
◆ తప్పుడు రీడింగ్‌లతో దోచుడు ఎక్కువ
◆ ప్రజల జేబులకు చిల్లులు







ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పెట్రోల్ బంకు యాజమాన్యాలు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నాయి. వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. పైగా తప్పుడు రీడింగ్‌లతో నొక్కుడు అధికంగా ఉంటోంది. విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ విచారణల్లోనూ ఇవి తేలాయి. ప్రత్యేకమైన చిప్‌లను ఏర్పాటు చేసి రీడింగ్‌లను ఏ రకంగా జంపింగ్ చేస్తున్నారన్నది తేట తెల్లమైంది. ఇంత జరుగుతున్నా పరిశీలించాల్సిన జిల్లా పౌర సంబంధాల శాఖ మాత్రం మిన్నకుండిపోతోంది. కనీస సౌకర్యాలు కల్పించని పెట్రోల్ బంకుల్లో సరిచేసే చర్యలు తీసుకున్న దాఖాల్లేవు.

నిబంధనలు ఇలా..

నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకులోనూ ఆరు రకాల కనీస సౌకర్యాలుండాలి. అందులో మొదటిది వాష్ రూమ్ సౌకర్యం ఉండటం. రెండోది సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించడం. మూడు ఉచితంగా గాలి, ఎమర్జెన్సీ కిట్, ఎమర్జెన్సీ కాల్ సౌకర్యాలు కల్పించాలి. జిల్లాలో అత్యధికం బంకుల్లో ఇవేవి ఉండటం లేదు. మరుగుదొడ్లు ఉన్నా కొన్నింటికి తాళాలు వేసి ఉండగా మరికొన్నింటికీ అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ఏవైనా లోపాలుంటే ఫిర్యాదు చేయడానికి విధిగా ఫిర్యాదుల బాక్సు ఉండాలి. అవి కూడా ఉండటం లేదు. వీటి నిర్వహణకు పది వేల లీటర్లు విక్రయిస్తే ఆరు వందల రూపాయలు నిర్వహణకు ఖర్చు పెట్టాలి. అదే విధంగా మరుగుదొడ్లు ఇతర నిర్వహణకు రూ.18 వేలు ఖర్చు చేయాలి. అయితే ఇవేవి ఉమ్మడి జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో అమలు జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.

నొక్కుడు మాత్రం ఫుల్..!

పెట్రోల్ బంకు యజమానులు మౌలిక సదుపాయల కల్పనపై దృష్టి సారించడం లేదుగాని, నొక్కుడుపై మాత్రం పెద్దఎత్తున దృష్టి సారించారు. రీడింగ్‌ల్లో మైక్రో చిప్‌లు అమర్చి ప్రతి వంద పాయింట్లకు పది పాయింట్లు జంప్ అయ్యేటట్టు అమరుస్తున్నారు. విజిలెన్స్ ఎన్‌పోర్సుమెంట్ ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో ఈ విషయం స్పష్టమైంది. పెద్దఎత్తున రీడింగుల్లో మోసాలు జరిగినట్టు తేలింది. వీటిపై చర్యలకు ఆదేశించారు. తనిఖీలు నిర్వహించని ఇతర బంకుల్లోనూ ఇదే తరహాలో మోసం జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. వీటిపై ఆయా శాఖల అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తుండటంతోనే ఇంత పెద్దఎత్తున అక్రమాలు జరగడానికి కారణమవుతోందన్న ఆరోపణలున్నాయి.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా డా॥బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లోనూ అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతపురం జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, తదితరులు. నివాళులు అర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా పరిషత్ లోని డిపిఆర్‌సి సమావేశ మందిరంలోనూ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. రాయదుర్గంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, శింగనమల, బుక్కరాయసముద్రంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ డా॥బిఆర్.అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలన్నారు. రాజ్యాంగంతో అందరికీ సమాన హక్కులు కల్పించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు.

వడ్డీతోనే పంట రుణాలు రెన్యువల్ చేయాలి

ఎంపీని కోరిన రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కరువు జిల్లాలో రైతుల బంగారు రుణాలు వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, రైతు కూలీ సంఘం క్రిష్ట డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రైతులు పెట్టుబడి ఖర్చులకు వడ్డీ వ్యాపారస్తుల నుంచి అప్పులు చేశారని, కుటుంబంలో ఉన్న కొద్ది బంగారం బ్యాంకులలో తాకట్టు పెట్టి పంటలు సాగు చేస్తే కష్టానికి తగ్గ దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రైతులు అప్పుల్లో కూరుకుపోయి తీవ్ర ఆందోళనల్లో నెట్టివేయబడ్డారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతుల రుణాలు వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

దళితవాడల సమస్యలపై ఉద్యమిస్తాం

సామాజిక చైతన్యయాత్ర ముగింపు సభలో నేతలు



సామాజిక చైతన్య యాత్ర ముగింపు సభలో ప్రసంగిస్తున్న ఐద్వా రాష్ట్ర నాయకురాలు వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో దళిత వాడల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ తెలిపారు. జ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్ స్మరించుకుంటూ సామాజిక న్యాయం కోరుతూ ఐద్వా, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన చేపట్టిన సామాజిక చైతన్యయాత్ర అంబేద్కర్ జయంతి రోజున సోమవారం ముగిసింది. నాలుగు రోజుల పాటు జిల్లాలోని 18 మండలాలు, 86 గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతపురం నగరానికి చేరుకున్న యాత్ర అంబేద్కర్ నగర్‌లో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓనల్లప్ప మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నుంచి అంబేద్కర్ జయంతి వరకు నాలుగు రోజుల పాటు జిల్లాలోని దళిత కాలనీల్లో సామాజిక చైతన్య యాత్రను నిర్వహించామన్నారు. దళిత కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఇళ్ల స్థలాలు, ఒంటరి మహిళల సమస్యలు, హాస్టల్లో మౌలిక సదుపాయాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, శ్మశాన సమస్యలు, కాలనీలలో డ్రెయినేజీ కాలవల సమస్య అనేకం నెలకొన్నాయని తెలిపారు. సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పాలకులు మారుతున్నారు తప్ప దళిత కాలనీలో సమస్యలు తీరడం లేదన్నారు. ఈ సామాజికయాత్రలో వచ్చిన సమస్యలను అధికారుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయకపోతే బాధితులను సమీకరించి ఉద్యమం చేస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, జిల్లా నాయకురాలు అశ్విని, కెవిపిఎస్ నాయకులు మసూద్, ఆక్కులప్ప, రాజా, నల్లప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా అధ్యక్షులు సిద్ధు, గిరి, భీమేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, కష్ణవేణి, పుల్లన్న, లక్ష్మీనారాయణ, చలపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, నగర అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీనారాయణ, తిరుమలేశు, మంత్రి వరలక్ష్మి, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గన్నెవారిపల్లిలో లోవోల్టేజీ సమస్య..!

◆ ఇంట్లో ఫ్యాన్ కూడా తిరగని పరిస్థితి
◆ ఏడాది నుంచి వేధిస్తున్న సమస్య
◆ అధికారులకు చెబుతున్నా పరష్కారం కాని వైనం



గన్నెవారిపల్లి కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్



ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

విద్యుత్ లైన్ లోవోల్టేజీ కారణంగా తాడిపత్రి సమీపంలోని కడప రోడ్డు గన్నెవారిపల్లి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని లైన్‌మెన్ నుంచి డిఈ స్థాయి అధికారి వరకు అందరికీ గత సంవత్సరం నుంచి విన్నవిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ కాలనీవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్ ఉన్నా లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు తప్పడం లేదు. 20 రోజుల కిందట ఇద్దరు విద్యుత్ అధికారులు వచ్చి అక్కడున్న ఇళ్లు, విద్యుత్ స్తంభాల మీదున్న లైన్లను పరిశీలించి వెళ్లారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని కాలనీవాసులకు చెప్పారు. అలా చెప్పి వెళ్లిన అధికారులు మళ్లీ తిరిగిరాలేదు. జిల్లా అధికారులపై నమ్మకం లేక కాలనీవాసులు ఆన్‌లైన్ ద్వారానూ విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను తిరుపతి విద్యుత్ ప్రధాన కార్యాలయానికి ఫోన్ ద్వారా తెలియజేశారు. అక్కడి నుంచి కూడా స్పందన రాలేదు. ఇంత మంది అధికారులకు చెబుతున్నా సమస్య పరిష్కారం కాకపోతే తమ మొర ఎవరికి చెప్పుకోవాలంటూ గన్నెవారిపల్లి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోవోల్టేజ్‌తో ఇళ్లలో ఫ్యాన్ కూడా తిరగడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక విద్యుత్ ద్వారా ఉపయోగించే యంత్రాలు అసలుకే పనిచేయడం లేదు. ఇన్వర్టర్ వేస్తేనే ఇంట్లో ఫ్యాన్ తిరిగే పరిస్థితి ఉంది. కాలనీలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన తీగలు కూడా కిందకు వేలాడుతూ చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను తీర్చాలని గన్నెవారిపల్లి కాలనీవాసులు కోరుతున్నారు.

ఆటోకు ఛార్జింగ్‌కూ కష్టమే



ప్రతిరోజూ ఆటో నడిపితేనే కుటుంబ జీవనం అవుతాది. ఎలక్ట్రికల్ ఆటో తెచ్చుకుని నెల రోజులు గడుస్తున్నా ఛార్జింగ్ సమస్యతో పది రోజులు కూడా ఆటో నడపలేకపోతున్నాను. సమస్యను అధికారులకు చెప్తున్నా ఎవరూ స్పందించలేదు. విద్యుత్ అధికారులు చొరవ చూపి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి.

విష్ణువర్ధన్, ఆటోడ్రైవర్, జీవీపీ కాలనీ.

ఫ్యాన్లు కూడా తిరగడం లేదు



వేసవికాలం కావడంతో కాస్త ఫ్యాన్ వేసుకుందామంటే లోవోల్టేజ్ కారణంగా ఫ్యాన్లు తిరగడం లేదు. విద్యుత్ సమస్య చాలా ఇబ్బందిగా ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి లైన్ అయినా మార్చాలి, లేకపోతే వోల్టేజ్ తట్టుకునేలా ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాను.

రామకృష్ణ, జీవీపీ కాలనీ.

అప్పుడప్పుడు మాత్రమే సమస్య

గన్నెవారిపల్లి కాలనీలో సమస్య ఎప్పుడూ లేదు.. అప్పుడప్పుడు మాత్రమే ఉంది. కాలనీవాసులు ఫిర్యాదు చేసినప్పుడు స్పందించి పరిశీలించాం. సమస్యపై గత ఆరు నెలలుగా ఫిర్యాదులు వస్తున్నాయం. దీనిని పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

వీరాంజనేయ రెడ్డి,
ఏఈ డి2, విద్యుత్ అధికారి తాడిపత్రి.

కేశేపల్లిలో నేలకొరిగిన వరి పంట



నేలకొరిగిన వరిపంట

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని కేసపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం కురిసిన ఉదురుగాలులు, వర్షానికి సుమారు 25 ఎకరాల్లో సాగుచేసిన వరి పంట మొత్తం నేలకు ఒరిగింది. రూ.15 లక్షల మేరకు నష్టం సంభవించి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి చిన్న వీరస్వామి తెలిపారు. మండలం వర్షానికి ఏవైనా పంట నష్టం జరిగిందా అని గ్రామాల వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

సేవామార్గం అవసరం

ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మణ్

ప్రజాశక్తి-నార్పల

సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సినీ ఫైట్ మాస్టర్లు రామలక్ష్మణులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యానసభ్యుల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఇందులో భాగంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామ్‌లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రకృతి తనకు తాను అప్పుడప్పుడు మహానుభావులను సృష్టించుకుని వారి చేత సమాజ హితం కోసం చేసే కార్యక్రమాలను చేయించుకుంటుందన్నారు. అలాంటి గొప్ప వ్యక్తే అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధ్యాన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు 'శ్రీరామిరెడ్డి' కార్మికుల వినతి



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న 'శ్రీరామిరెడ్డి' కార్మికులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

వేతనాలు, సమస్యల పరిష్కారం కోసం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం కూడా కొనసాగింది. కార్మికుల సమస్యలను పట్టించుకోని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వినూత్నంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ముందుగా అంబేద్కర్ జయంతి సందర్భంగా సిఐటియు నాయకులు, శ్రీరామిరెడ్డి కార్మికులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతంలో శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేత నాలు, పిఎఫ్ చెల్లించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టారన్నారు. ఓ వైపు వేతనాలందక కార్మికులు.. మరో వైపు తాగునీరందక గ్రామల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయకపోవడం భాదకరమైన విషయం అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా కార్మికుల ఆవేదన ను ఆయన విగ్రహం ముందు వ్యక్తం చేస్తూ నిరసన తెలుపుతున్నామన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కార్మికులకు అందాల్సిన 6 నెలల వేతనాలు, 30 నెలల పిఎఫ్ వెంటనే చెల్లించాలన్నారు. అలాగే కార్మికుల సంఖ్యను తగ్గించరాదని, తాగునీటి సంస్థలకు బడ్జెట్ కేటాయించాలని, కార్మికులపై కక్ష సాధింపులకు పాల్పడే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భవిత్, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయ కులు వన్నూరుస్వామి, నరేష్, రామ్‌దాస్, చిత్తప్ప, నాగరాజు, వెంకటేశులు, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు ఆదర్శనీయం

జిల్లా జడ్జి శ్రీనివాస్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజల ప్రాణాల సంరక్షణలో అగ్నిమాపక సిబ్బంది సేవలు ఆదర్శనీయమని జిల్లా జడ్జి శ్రీనివాస్ కొనియాడారు. సోమవారం ఈనెల 20వతేదీ వరకూ నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల గోడపత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ముందుగా అగ్నిమాపక వీరులకు నివాళులర్పించారు. అనంతరం ట్రేల్లీస్ స్కూల్ విద్యార్థులు, బాలాజీ విద్యాసంస్థలు, ఎస్ఆర్ఐటికి చెందిన విద్యార్థులు, ప్రజలు, అగ్నిమాపక సిబ్బంది కలిసి అగ్నిమాపక శకటాలతో నగరంలో కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఫైర్ సర్వీస్ సభ్యులు అగ్నితీవ్రతను తగ్గించడంలో, ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడడంలో ప్రాణాలకు తెగించి పని చేస్తారన్నారు. వారి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. తర్వాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ అగ్నిమాపక అధికారి భూపాల్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న జడ్జి, అధికారులు

నేడు చలో డిఇఓ కార్యాలయం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య పెంచి డిఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో డిఇఓ కార్యక్రమాన్ని డిఎస్సీ అభ్యర్థులు హాజరై జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, కసాపురం రమేష్ సోమవారం అన్నారు. డిఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే ఇవ్వాలని కోరుతూ నేడు నగరంలో ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభమై డిఇఓ కార్యాలయం వరకు చేపట్టి, ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అగ్నిమాపక వారోత్సవం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

అగ్నిమాపక వారోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఆఫీసర్ ఎల్.వసంతనాయక్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. 1944 ఏప్రిల్ 14వ తేదీ జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు 66 మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందారు. వారి జ్ఞాపకార్థం అగ్నిమాపక కేంద్రంలో ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రెండు నిముషాలు మౌనం పాటించారు. అలాగే పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్.మారుతమ్మ, ఎంపిపి జిఎస్.రామచంద్ర, ఎంపిడిఓ వారు ముఖ్య అతిథి గా రావడమైనది.

టిటిడి గోశాలపై దుష్ప్రచారం తగదు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



సిఎం రిలీఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలపై మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి దుష్ప్రచారం చేయడం తగదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సోమవారం నగరంలోని అనంతపురం అర్బన్ కార్యాలయంలో 12 మందికి మంజూరైన 12.15 లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అర్బన్ నియోజకవర్గానికి 12 విడతల్లో రూ.1.9కోట్లు మంజూరు చేస్తే సగం మొత్తం మైనార్టీలకే అందించామన్నారు. జనసేపో తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి హిందూ వ్యతిరేకిగా అన్నారు. గతంలో ఆయన శ్రీవెంకటేశ్వరస్వామిని నల్లరాయితో పోల్చారని, ఇప్పుడు ఎక్కడో చనిపోయిన గోవులను టిటిడి గోశాలలో చనిపోయాయని చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు ఇలాంటి దుష్ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగారాం, కూచి హరి, రాయల్ మురళి రాయల మధు, సయ్యద్ సైఫుద్దీన్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



ఇంటిపై విరిగి పడిన విద్యుత్ స్తంభం

నార్పల : మండల పరిధిలోని తుంపెర బీసీ కాలనీలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీనికితో భారీ చెట్లు కింద పడిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో తీగలు ఇళ్లపై పడ్డాయి. దీంతో వెంటనే విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-అనంతపురం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నగరంలోని శ్రీపొట్టి శ్రీరాములు పాఠశాలలో 1976-77లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి అధ్యక్షతన సోమవారం ఒకచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు సూర్యనారాయణ శాస్త్రి, రంగప్ప, కృష్ణమూర్తి, గంగాధారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రిటైర్డ్ హైకోర్ట్ న్యాయమూర్తి శ్యామసుందర్, అటవీశాఖ అధికారి అంజనేయులు, వైద్య ఆరోగ్య శాఖ పద్మవేణు మనోహర్, పోస్టుమాస్టర్ వన్నప్ప, ఆడిటర్ హనీఫ్, విశ్రాంత తహశీల్దార్ సిరాజుద్దీన్, విద్యా శాఖ షేక్ మహబూబ్‌బాషా, రియాజుద్దీన్, రక్షణ శాఖ లక్ష్మీకాంతరెడ్డి, వ్యాపార వేత్త అబ్దుల్ ఖయూమ్, తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా 'పరిటాల' పోరాటం

ఎమ్మెల్యే పరిటాల సునీత



సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

గ్రామాల్లో అంటరానితం, కులవివక్షకు వ్యతిరేకంగా పరిటాల శ్రీరాములు పోరాటం చేశారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని సోములదొడ్డి వద్ద ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. అనంతరం రూ.60 లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ఐక్యంగా, సమానంగా జీవిస్తున్నామన్నారు. ఆరోజుల్లో రామగిరి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎస్‌సిలను కనీసం బావుల్లో నీరు కూడా తాగనిచ్చేవారు కాదని గుర్తు చేశారు. అయితే తన మామ పరిటాల శ్రీరాములు దీన్ని వ్యతిరేకించి పోరాటాలు చేశారన్నారు. ఈ పోరాటాన్ని చాలామంది వ్యతిరేకించినా శ్రీరాములు ఎస్సీల పక్షాన నిలబడ్డారన్నారు. అప్పటి నుంచి నేటి వరకూ తమకు ఎస్సీ, ఎస్టీ, బీసీలతో తాము సమానంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వేణుగోపాల్, పాముురాయి వెంకటేష్, ఎంఆర్‌పిఎస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-నార్పల



పామిడి మండలంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని బేల్దారు కాలనీ, చైతన్య కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఇఒఆర్‌డి శైలజారాణి, సర్పంచి సుప్రియ, కార్యదర్శి రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నీటి సమస్య అధికంగా ఉందని, శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఉద్దిబావి చేను వీధి మురుగు కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జనసేన పార్టీ మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, తుపాకుల భాస్కర్, పొన్నతోట రామయ్య, షేక్ రహంతుల్లా, వినోదం నారాయణస్వామి, శ్రీధర్ బాబు, కుళ్లాయప్ప, సంగా అశోక్, గంగాధర్, వినోదం లోకేష్, చరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ గోపాల్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తేజోష్ణ పంచాయతీ పరిధిలోని గత ఆర్థిక సంవత్సరంలో అమలు చేసిన కార్యక్రమాలపై వివరించారు. తర్వాత ప్రస్తుత ఆర్థిక సంవత్సర కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయా, ఐసిడిఎస్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం : అనంతపురం రూరల్ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచు జి.ఉదయ్‌శంకర్ అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై పలువురు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఆశాజ్యోతి, డివిజినల్ పంచాయతీ అధికారి విజయకుమార్, ఎంపిడిఒ పి.దివాకర్, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీధర్‌రావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అల్తాఫ్, సమాచార హక్కు చట్టం పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్

నార్పల : ఎపి బిసి సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు మారేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రైజింగ్ రాజశేఖర్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు సుభాష్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోషకాహారం తీసుకోవాలి

నార్పల : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని అంగన్వాడీ టీచర్ జయంతి సూచించారు. సోమవారం స్థానిక మంజునాథ టాకీస్ అంగన్వాడీ సెంటర్‌లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ తీసుకునే ఆహారంలో పోషక విలువలతో కూడిన ఆకుకూరలు, కూరగాయలు వంటి పదార్థాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు ఆహారంగా తీసుకోవడం ద్వారా చాలా వరకూ రక్తహీనతను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ షేకున్‌బీ, ఆయాలు మాబున్నీ, కీర్తి, తల్లులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు

పెద్దవడుగూరు : మండలంలోని లక్షంపల్లిలో పక్కీరప్పస్వామి గంధం ఉరుసు ఉత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామంలో ఒకప్పుడు ఈప్రాంతంలో కలరా, ప్లేగు వ్యాధి వ్యాప్తి అధికంగా ఉన్నందున ప్రజలు చనిపోతున్నప్పుడు సంఘసేవతో ఇక్కడి భక్తులను చేరదీసి భజనలతో రాత్రిళ్లు సంచరించి ఇక్కడి ప్రజలకు మనోధైర్యాన్ని, స్థితిప్రజ్ఞతభావాన్ని నెలకొల్పారు. అప్పటి నుంచి ఆయన సమాధి వద్ద ఆరాధన కార్యక్రమాలు జరుగుతున్నాయని పెద్దలు చెబుతారు. ఉత్సవం ఏదైనా కులమత భేదాలు లేకుండా ప్రజలు చేసుకుంటారు. మంగళవారం ఉరుసు ముగియనుంది.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

నార్పల : మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులు శిక్షారులు అవుతారని ఎస్ఐ సాగర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కాలంలో రాత్రి సమయంలో మండల కేంద్రంలో చాలామంది పిల్లలు అతివేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎవరైనా పిల్లలు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే జరిమానా విధించడంతోపాటు తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారన్నారు. అంతేగాకుండా త్వరలోనే పాఠశాలలకు వేసవి సెలవులు వస్తున్నాయని.. పిల్లలు ఎటు వెళ్తున్నారు.. ఎవరితో తిరుగుతున్నారనే విషయాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. లేకపోతే పిల్లలు చెడు స్నేహాలకు అలవాటు పడి వ్యసనాలకు అలవాటు పడతారని సూచించారు.

దార్శనికుడు బిఆర్.అంబేద్కర్

జయంతి కార్యక్రమాల్లో వక్తలు



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సామాజిక తరగతుల హక్కులు పటిష్టం కావాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కుల వివక్ష పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం కెవిపిఎస్, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు నేటికీ నెరవేరని పరిస్థితి ఉందన్నారు. సామాజిక తరగతుల హక్కుల కోసం పాటుపడ్డారని, కుల వివక్షత అంటరానితనం దాడులు దౌర్జన్యాలు రూపుమాపేందుకు పరితపించారని తెలిపారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ నిర్వీర్యం చేస్తోందన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్రమైన అన్యాయం చేస్తూ, బడ్జెట్‌లో కోతలు విధిస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు సమైక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, జిల్లా నాయకులు జీవా, రాజు, అక్కులప్ప, నల్లప్ప, నాగేంద్ర, పుల్లన్న, సీనా, వన్నూరప్ప, సిపిఎం నాయకులు, వలి, ప్రకాష్, మసూద్, వెంకటనారాయణ, ముర్తుజా, ఇర్ఫాన్, గోపాల్, లతీఫ్ ఏటీఎం నాగరాజు, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ, వెంకటనారాయణ, గఫూర్, ఓబులేసు, ఆది తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పగా కీర్తించబడుతోందని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక జెఎన్‌టియు పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి విసి ఎన్.దేవన్న, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, పిఆర్ భానుమూర్తి, జి.ప్రశాంతి, ఈశ్వర్‌రెడ్డి, జివి సుబ్బారెడ్డి, సుజాత, కిరణ్మయి, విబి చిత్ర, శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వసుంధర, ఎం.అంకారావు, శ్రీధర్, ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ క్యాక్రమంలో ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వి.వసుంధర, కెబి చంద్రశేఖర్‌రెడ్డి, దేవకుమార్, రామశేఖర్‌రెడ్డి, జోజిరెడ్డి, డిఆర్‌లు మధుసూదన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరళ, సీనియర్ డాక్టర్లు కెఎల్ సుబ్రమణ్యం, రమేష్‌బాబు, నిహారిక, ప్రశాంతి, అనిల్‌కుమార్, పునర్ జీవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహనాయక్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే టిడిపి శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుఅంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజావేదికలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బొమ్మనహాల్ : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, సచివాలయాలు, విద్యుత్, ఆరోగ్య కేంద్రాలు, పోలీస్ స్టేషన్‌లో అధికారులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ కార్యాలయంలో విఆర్ఎలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మిఠాయిలు పంచిపెట్టారు.

శింగనమల : అంబేద్కర్ జయందిని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని విగ్రహానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, దండు శ్రీనివాసులు, దేగల కృష్ణమూర్తి, మారుతీనాయుడు, ఎం.ఆదినారాయణ, జి.సత్యనారాయణ, మాసూలు చంద్రమోహన్, చాకలి వెంకటేష్, నాగముని, అనిల్, అట్టే శంకర్, సురేంద్రయాదవ్, పుల్లయ్య, రమేష్, జడేజా, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పసపల శ్రీరామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం : నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ నగర్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించి అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మహబూబ్ బాషా, వెంకటేశులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలోని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నివాసం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి మెట్టు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, గౌని ఉపేంద్రరెడ్డి, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామాంజనేయులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర పూర్వ కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా కార్యదర్శి సుబ్బారాయుడు, చంద్రమోహన్, సీనియర్ నాయకులు మహమ్మద్ జీలాన్, నాయకులు భాస్కర్, వీరాచారి, రామాంజినేయులు, హేన్రీ, నాగరాజు, వీర ఓబులు, విక్టర్, రాజకుల్లాయప్ప, వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెవివి రాష్ట్ర నాయకులు కె.భాస్కర్, జిల్లా నాయకులు గాంగే నాయక్, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎం.రామిరెడ్డి, కె.వీరరాజు, నాయకులు తిరుపాలు, ప్రసాద్ రెడ్డి, రామకష్ణ, ముత్యాలు, లక్ష్మీనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ నగర్‌లోని కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం నగర నాయకులు ప్రకాష్, వలి, తదితరులు హాజరై నివాళులు అర్పించారు.

పుట్లూరు : మండలంలోని ఓబులాపురం గ్రామంలోసిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌చౌదరి, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగభూషణం, వ్యకాసం మండల కార్యదర్శి పెద్దయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి భాస్కర్, కెవిపిఎస్ మండల నాయకులు ఏసురత్నం, వ్యకాసం నాయకులు జె.పెద్దయ్య, విటి కుళ్లాయప్ప, సుధాకర్, మల్లికార్జున, రాజు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ దూదేకుల షేకన్న ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హెచ్ఎల్‌సి కాలనీలో ఉన్న కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు తిమ్మారెడ్డి, రంగారెడ్డి, నాగిరెడ్డి, వై.ప్రసాద్, ఈశ్వరయ్య, పెంచలయ్య, రవికుమార్, ఎస్.ఖాజామొయినుద్దీన్, ఎం.నరసింహులు, పి.సిద్దన్న, ఎకె మొయిద్దీన్, మణికుమార్, బండి వెంకటరమణ, ఆర్ఎస్ నాగరాజ్, హుస్సేన్‌బాషా, బాలస్వామి పాల్గొన్నారు.

స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, మాజీ ప్రిన్సిపాల్ రంగస్వామి, అంబేద్కర్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శేషారెడ్డి, జిసిటిఎ జిల్లా అధ్యక్షులు కోనింగ్ శ్రీధర్, స్టడీ సెంటర్ సిబ్బంది రామానాయుడు, నరసింహప్ప, జయప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అనంతపురం : అనంతపురం మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జూటూరు చంద్రకుమార్, మండల అధ్యక్షురాలు గుజ్జుల వరలక్ష్మి, ఎంపిడిఒ దివాకర్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఎగ్గిడి వరలక్ష్మి, వన్నూరప్ప, వెంకటేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండల కేంద్రం సమీపంలో ఉన్న పంగల్ రోడ్డులో సిఐటియు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, రైతుసంఘం మండల కార్యదర్శి పోతులయ్య, హమాలీలు అమర, సుబ్బారావు, నారాయణస్వామి, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్‌సి సెల్ మండల సెక్రటరీ చర్మల రాము, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, వివిధ కుల సంఘాలు, యువజన సంఘాల నాయకులు సోమవారం మండల కేంద్రంలోని ఎద్దులపల్లి సర్కిల్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం అంబేద్కర్ కాలనీ వాసులు చిత్రపటాన్ని ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, సిఐ యుగంధర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విజయ్, వీఆర్వో భాగ్యలక్ష్మి, బీఎస్పీనాయకులు వెంకటయ్య, ఎదురూరు ఓబులేసు, మల్లికార్జున, ఎంఆర్‌పిఎస్ నాయకులు సుంకన్న, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు చలపతి, భారతీయ భీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు రామాంజనేయులు, సాకే ఓబులేసు, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, అంజినాయక్, కుమార్, వంకరాజు కాలువ వెంకటేష్, పూజారి లక్ష్మీదేవి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌చౌదరి, జింకల సంజీవకుమార్, బొమ్మా మోహన్, బాలు, కొండాపురం రాజు, రాజేష్ నాయక్, పాళ్యం శేఖర్, సురేష్‌నాయక్, రవి, సల్లు, రమణ, కొండాపురం రంగనాయకులు, కొండాపురం సుధీర్, బొట్టు రామచంద్ర, గొర్ల సుంకన్న, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

గుత్తి : అంబేద్కర్ జయంతిని పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జి.విశాలక్ష్మి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.జబ్బర్‌మియా, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ డి.ఓబిలేసు, సిఎస్ డిటి కె.సూర్యనారాయణ, పోలీస్‌స్టేషన్‌లో సీఐ బి.వెంకటేశ్వర్లు ఎస్ఐ కె.సురేష్, తదితరులు అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న విగ్రహానికి వైసీపీ పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్‌రెడ్డి, నాయకుడు డి.హుస్సేన్‌పీరా, జెవివి రాష్ట్ర నాయకులు ఎం.రంగన్న, జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షుడు ఎ.రామాంజనేయులు, జెన్నే కుళ్లాయిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుంతకల్లు రోడ్డు లో ఉన్న విగ్రహానికి టిడిపి గుత్తి, పామిడి మండలాల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, దిల్కాశీనా పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమ్ రావు కాలనీలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, రైతు సంఘం నాయకుడు బి.రామకష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు అంజన ప్రసాద్, జి.రామదాసు, ఎన్.ఈరన్న, నగదాని సత్య ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

పెద్దవడుగూరు : బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ ఆంజనేయులు, ఉప తహశీల్దార్ వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ షర్మిల, ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ మల్లారెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో ఇఒఆర్‌డి నాగేశ్వరరావు సాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. అలాగే ప్రయివేటు పాఠశాలలో సన్‌రైజర్స్ కరస్పాండెంట్ టి.మారెన్న, శ్రీ శ్రీనివాస విద్యానికేతన్ ప్రయివేట్ పాఠశాలలో కరస్పాండెంట్ వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

గుమ్మఘట్ట : గుమ్మగట్ట మండలం తాళ్లకేర గ్రామంలో ఎస్సీ యువకులు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలువ సన్నన్న, ఎస్ఐ ఈశ్వరయ్య, పంచాయితీ కార్యదర్శి భీమేష్, మండల కన్వీనర్ గిరిమల్లప్ప, ఎస్సీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశులు, వీరాపురం సర్పంచు నాగరాజు, హనుమంతురెడ్డి, సత్తిరెడ్డి శ్రీరాములు, పాలయ్య, రామప్ప, ఓబులేసు, బద్రీ, రామకృష్ణ, బాలు, వీరభద్రప్ప, తిప్పేస్వామి, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మగట్ట గ్రామంలో హైస్కూల్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు విజయలక్ష్మి, టిడిపి మండల కన్వీనర్ తిరుమలప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, టిడిపి నాయకులు సదాశివ, సిద్ధి, లింగప్ప, జయరాములు, మల్లికార్జున, పీడీ వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలతోపాటు పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రిలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి భవాని, ఎంపిడిఒ రామకృష్ణ, ఎస్ఐ ఈశ్వరయ్య, డాకట్ర్ బాలాజీనాయక్, డాక్టర్ సంతేష్, సిహెచ్ మురళీధర్, వైసిపి నాయకులు బీటీపీ గోవిందు, రాజు, వన్నూరుస్వామి పాల్గొన్నారు

నార్పల : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి జిల్లా టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టు రంగారెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు చంద్రబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పిఎల్ లక్ష్మీనారాయణ, కేశేపల్లి నాగేంద్ర, కేశవరెడ్డి, ఆది కేసేపల్లి, చిన్న, నడిమింటి రాము, తలారి హరీష్, తలారి మహేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో సర్పంచు రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు రాజ్యాంగ హక్కులపై సర్పంచు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

డి.హీరేహాల్ : మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన అజయ్ (17) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సంజీవప్ప, భార్య నింగమ్మ కుమారుడు అజయ్ పదో తరగతి చదువుకుని ఇంటర్‌ను మధ్యలో ఆపేసి పనులకు వెళ్లేవాడు. ఈనేపథ్యంలో తాను జెసిబి పనికి వెళ్తానని తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. నిన్న సాయంత్రం వేరుశనగ కాయలు నింపడానికి పొలానికి రావాలని తల్లిదండ్రులు అజయ్‌ను కోరారు. అయితే మీరు వెళ్లండి.. తాను తర్వాత వస్తానని చెప్పి ఇంట్లో ఎవరూలేని సమయంలో గరండాకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం నుంచి ఇంటికి వచ్చిన అజయ్ మామ గమణించి తల్లిదండ్రులు, పోలీసులకు సమచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నిందితుడు అరెస్టు

నార్పల : మండల కేంద్రంలోని సంత మార్కెట్‌లో ద్విచక్రలోని రూ.3 లక్షల నగదును దొంగలించిన ఎరుకుల బండి చిన్నను అరెస్టు చేసినట్లు సిఐ కౌలుట్లయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సాగర్‌తో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండల కేంద్రంలోని సంత బజారులో దస్తగిరి బట్టల షాపు దగ్గర వెంకటాంపల్లికి చెందిన శ్రీనివాసులు, భార్య కలిసి గతేడాది అక్టోబర్ 5న నార్పల స్టేట్‌బ్యాంకు నుంచి రూ.3లక్షలు డ్రా చేసుకుని ద్విచక్ర వాహనం బ్యాగులో డబ్బు పెట్టి దుస్తులు కొనేందుకు వెళ్లారు. ఈనేపథ్యంలో ద్విచక్ర వాహనంలో ఉన్న నగదును చోరీ చోరీ చేశారు. ఈనేపథ్యంలో సీసీ పుటేజీలను పరిశీలించి సోమవారం ఉదయం స్థానిక హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందికి ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఓ యువకుడు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఖలీల్‌బాషాకు హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని గుత్తి ఆర్ఎస్ కు చెందిన ఓ వ్యక్తి గత మూడు ఏళ్ల క్రితం రూ.3లక్షలు తీసుకున్నాడు. అయితే ఉద్యోగం ఇప్పించక, నగదు తిరిగి ఇవ్వకపోవడంతో ఖలీల్ బాషా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంటలకు ఉపయోగించే పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఖలీల్ ను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తిపై వేటకొడవలితో దాడి

బొమ్మనహాల్ : నిద్రిస్తున్న వ్యక్తిపై మరో వ్యక్తి వేట కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని కల్లుహోల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నబిరసూల్ తెలిపిన వివరాలు.. కల్లుహోల గ్రామానికి చెందిన సోమనాథ్‌గౌడ్ ఆదివారం రాత్రి తన ఇంటి ముందు ఆరుబయట నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన గోవిందు కాపు కాచి అర్ధరాత్రి దాటిన తర్వాత వేట కొడవలితో దాడి చేసి మూడుసార్లు విచక్షణారహితంగా నరికాడు. దీంతో సోమనాథ్‌గౌడ్ పైకి లేచి కేకలు వేస్తూ పరిగెత్తడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. దీంతో గోవిందు తప్పించుకుని పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన సోమనాథ్‌గౌడ్‌ను బళ్లారిలోని ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన గోవిందుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి మధ్య ఉన్న వ్యక్తిగత విభేదాల నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది.

రాయంపల్లిలో రెండు వర్గాల ఘర్షణ

రాయదుర్గం : మండలంలోని రాయంపల్లి గ్రామంలో సోమవారం ఇరు వర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అంబేద్కర్ కాలనీ బోర్డు ఏర్పాటు విషయంలో కాలనీవాసులు, అగ్రవర్ణాల మధ్య ఘర్షణ తలెత్తింది. కలెక్టర్‌గా గంధం చంద్రుడు ఉన్నప్పుడు దళిత కాలనీలకు మహనీయుల పేర్లు పెట్టాలనే యోచనతో మండలంలో పలు దళిత కాలనీలకు బిఆర్.అంబేద్కర్ కాలనీలుగా నామకరణం చేశారు. అందులో భాగంగా రాయంపల్లిలో అంబేద్కర్ కాలనీగా బోర్డు ఏర్పాటు చేయగా ఇటీవల కురిసిన వర్షాలకు ఆ బోర్డు పడిపోయింది. దీంతో అంబేద్కర్ జయంతి రోజున కాలనీవాసులు ఆ బోర్డును తిరిగి ఏర్పాటు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేశాయి.

యువ వ్యాపారి ఆత్మహత్య

నార్పల : తాను కాయలు కొన్న తోటలో పంట సరిగా రాలేదన్న బాధతో యువ వ్యాపారి చరణ్ క్రిమి సంహారకమందు తాగి సోమవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు.. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని నార్పర సుల్తాన్ పేటకు చెందిన నాగభూషణం కుమారుడు చరణ్ కొద్దికాలం నుంచి రైతుల మామిడి తోటల తీసుకుని వ్యాపారం చేసేవాడు. ఇందులో భాగంగా ఈఏడాది సుమారు రూ.20 లక్షల వరకూ అప్పులు చేసి మామిడి తోపులు తీసుకున్నాడు. అయితే మామిడి తోటల్లో పంట సరిగా రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కు తెలియక మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి సమీపంలో ఉన్న మామిడి తోటలో క్రిమి సంహారకమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.